క్లుప్తంగా

వనపర్తి సీఐగా నాగభూషణరావు



వనపర్తి: వనపర్తి సీఐగా నాగభూషణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ మహేశ్వరరావును ఇటీవల డీఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా నాగభూషణరావును వనపర్తికి కేటాయించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన మర్యాదపూర్వకంగా ఎస్పీ రక్షితా కె మూర్తిని కలిసి మొక్క అందజేశారు. ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరిస్తూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

కొత్తకోట సీఐగా కె.రత్నం



కొత్తకోట రూరల్: కొత్తకోట సీఐగా కె.రత్నం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన నాటి నుంచి లాంగ్‌లీవ్‌లో ఉండటంతో ఆత్మకూర్ సీఐగా పనిచేస్తున్న కె.రత్నం ను ఇన్‌చార్జ్ సీఐగా కొనసాగించారు. పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆత్మకూర్ సీఐ రత్నం కు కొత్తకోట సీఐగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. వివాదాలకు చోటిచ్చిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల తర్వాత ఇటువైపు రాకుండానే బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం సీఐగా కె.రత్నం ఒకటి రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

అధికారులకు సన్మానం



పెబ్బేరు రూరల్: కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు పొందిన శ్రీరంగాపురం తహసీల్దార్ మురళీగౌడ్, ఆర్ఐ రాధాకృష్ణను అంబేడ్కర్ కాలనీవాసుల బుధవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ అధికారులకు ప్రజలకు ఉత్తమ సేవలు అందించి మరిన్ని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రమేష్, కురుమన్న, రాములు, జె.రమేష్, సంపత్, కురుమన్న, కిట్టు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా వినయ్‌కుమార్, కలెక్టర్‌గా భార్గవి, డీఈఓగా సాయిప్రసన్నతో పాటు 55 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాలికలకు వైద్య పరీక్షలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల బాలికలకు ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో బుధవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా 8, 9, 10వ తరగతి బాలికలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేసినట్లు టీం డాక్టర్ హరీష్ పేర్కొన్నారు. దీంతో పాటు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మంజుల, వైద్య సిబ్బంది సతీష్, నాగేశ్వరి, ఆశా కార్యకర్త రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి

ఆత్మకూర్: ఉమ్రహ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులు ప్రపంచ శాంతి, సర్వమానవాళి కోసం ప్రార్థించాలని పలువురు సూచించారు. బుధవారం ఆత్మకూర్ నుంచి ఉమ్రహ్ యాత్రకు బయలుదేరిన చాంద్‌పాషకు బాల్యమిత్రులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దివాన్జీ ప్రభాకర్‌రావు, సంతోష్‌కుమార్, దివాన్జీ అశోక్‌కుమార్, నాగరాజు, సైదోద్దీన్ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి



గట్టుకాడిపల్లిలో కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గట్టుకాడిపల్లిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన కల్యాణమండపాన్ని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సర్పంచు దేవేందర్‌తో కలిసి ప్రారంభించారు. రుక్కన్నపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనం, రూ.5 లక్షలతో నిర్మించిన నర్సరీ షెడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయమే జరిగిందన్నారు. గ్రామాల అభివృద్ధిని నీరుగార్చి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు అక్రమాలకు తెర లేపారని ఎద్దేవా చేశారు. కానీ ఇప్పుడు ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రావు, రాళ్ల కృష్ణయ్య, డాక్టర్ నరేందర్‌గౌడ్, సతీష్‌కుమార్, రామకృష్ణారెడ్డి, లింగస్వామి, వెంకట్‌రెడ్డి, నవీన్, దేవిజానాయక్, క్యామ బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

పెబ్బేరు రూరల్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పెబ్బేరు మండల కేంద్రంలో చౌడేశ్వరి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న పీపీఎల్–14 క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా ధృడత్వం ఏర్పడుతుందన్నారు. నియోజకవర్గంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటయ్యయాదవ్, టౌన్ అధ్యక్షులు వెంకట్‌రాములు, రంజిత్‌కుమార్, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, సత్యనారాయణ, ఎల్లస్వామి, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, యుగేంధర్‌రెడ్డి, వినయ్, వేణుగోపాల్, శివ, సునీల్, కౌన్సిలర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నూతన భవనం ప్రారంభం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ సభ్యులు శ్యామల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా అవసరాల నిమిత్తం జీపీలకు సొంత భవనాలను నిర్మించడం హర్షించదగిన విషయమన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.13 లక్షలతో నిర్మించే పంచాయతీ భవనానికి 2019 సంవత్సరంలో భూమిపూజ చేసినా.. నిధుల కొరతతో కొంత ఆలస్యం అయిన భవనం పూర్తి చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిత, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, భీరయ్య, వెంకటయ్య, శ్రీనివాసులునాయుడు, సీపీఐ నాయకులు కళావతమ్మ, ఊషన్న, శ్రీరామ్ పాల్గొన్నారు.

పంచాయతీ సభ్యులకు సన్మానం

సర్పంచ్, వార్డు సభ్యులను ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 2తో సర్పంచుల కాల పరిమితి పూర్తి కావస్తుండటంతో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, ఉప సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ శ్యామల, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి హరిత, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీని గద్దె దించడమే లక్ష్యం



మాట్లాడుతున్న జాన్ వెస్లీ

పెబ్బేరు రూరల్: మతోన్మాద బీజేపీని ఓడించి ప్రధాన మంత్రి మోదీని గద్దె దించడమే తమ లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు సీపీఎం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సీపీఐ(ఎం) శాయశక్తులా పోరాడుతుందని పేర్కొన్నారు. బీజేపీలో ఇప్పటి వరకు మోడీ ఒక్కరే స్టార్ క్యాంపెనర్‌గా ఉండేవారని, ఇప్పుడు ఆయనతో పాటు రాముడు కూడా స్టార్ క్యాంపెనర్‌గా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉంటారని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధతపై సీపీఎం కేంద్ర కమిటీ చర్చించిందన్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ తీరు రాజ్యాంగాన్ని ఉల్లంఘించేందుకు బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందనే విషయాన్ని వెల్లడించిందన్నారు. బీజేపీ గద్దె దించేందుకు రాష్ట్రాల వారీగా సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, కార్యవర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, బాల్‌రెడ్డి, గోపి, మండ్ల రాజు, ఎస్ రాజు, వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..



అమరచింత కొత్తతండా సమీపంలో రహదారి పక్కన తవ్విన గుంత

అమరచింత: మండల కేంద్రం నుంచి మద్దూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రహదారి పక్కన కేబుల్ లైన్ కోసం తవ్విన గుంత ప్రమాదకరంగా తయారయ్యింది. రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులతో పాటు ఇతర వాహనదారులు ఆదమరిచి ఉంటే గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. జియో ఇంటర్నెట్ లైన్ కోసం రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న కేబుల్ లైన్‌కు మధ్యమధ్యలో ఇలా గుంతలను తవ్వి వాటిని పూడ్చకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయందోళనలు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి వాటిని పూడ్చివేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ దేవర్లు



బండారు చల్లుకుంటున్న భక్తులు



అమ్మవారికి సమర్పించే పొట్టేళ్లతో కురువలు

అమరచింత: డిల్లంపల్లం అంటూ కుర్వ డోళ్ల వాయిద్యాల మధ్య బోనం కుండలతో ఊరేగింపులు, మహిళలు ఏల్లంద్యావర్లలో పూనకంతో జోకలే.. జోకా అంటూ అనే నినాదాలతో పాంరెడ్డిపల్లి పులకించింది. ఐదేళ్లకో పర్యాయం కురువలు నిర్వహించే ఎల్లమ్మ దేవర్ల ఉత్సవాలు మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన కురువలు బంధువులతో బండారు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తలపై బండారు(పసుపు) చల్లుకుని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపాల్‌పేట: మండల కేంద్రంతో పాటు ఏదుట్లలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గోపాల్‌పేట విద్యుత్‌శాఖ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. గోపాల్‌పేట సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ ఉన్నందున విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన పెద్దబోయిని నారాయణ మృతదేహానికి బుధవారం ఎంపీటీసీ హైమావతి, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మయ్య, రాముయాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. దీంతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో హన్మంతు, నర్సింహ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ వితరణ

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు వాటర్‌ట్యాంక్‌ను బుధవారం హెచ్‌ఎం ఆంజనేయులుకు అందజేశారు. అనంతరం వారు పాఠశాలలో పనిచేసిన స్వీపర్‌ను సన్మానించి, రూ.5వేల ఆర్థికసాయం అందించారు.

అంటరానితనం నేరం

ఆత్మకూర్: అంటరానితనం నేరమని, సమాజంలో అందరూ సమానమేననే భావనతో పౌరులు మెలగాలని ఏఎస్ఐ బీచుపల్లి అన్నారు. బుధవారం మండలంలోని రేచింతలలో సివిల్‌రైట్స్‌డే కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయాల్లో దళితుల ప్రవేశం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు తదితర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, ఎంపీటీసీ అలివేలు బీషన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



అమరచింత: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బుధవారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎంపీఓ నరసింహులుతో పాటు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి ఎండీ గౌస్ సమక్షంలో క్యాలెండర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో జేపీఎస్ అధ్యక్షుడు రాజిక్, యాదయ్య, దేవన్న, లక్ష్మయ్య, కరుణాకర్ రెడ్డి, ప్రదీప్, భాస్కర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



శ్రీరంగాపురంలో..



షాపురంలో సర్పంచ్, వార్డు సభ్యులు, కార్మికులను సన్మానిస్తున్న డీపీఆర్‌ఓ

ఖిల్లాఘనపురం: జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టినప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని షాపురంలో సర్పంచు బాలాంజనేయులు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు, వార్డు సభ్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ సత్యనారాయణ సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, కార్మికులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్మికులను సన్మానించడం వలన వారి ప్రోత్సహించినట్లవుతుందన్నారు. సర్పంచుతో పాటుగా సిబ్బంది అందరూ సక్రమంగా విధులు నిర్వహించినప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్‌లో..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వినీలారాణి అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేళ్లలో గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామస్తుల సహకారం మరువలేనిదన్నారు. గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిశోర్, ఉప సర్పంచ్ శివసాగర్, ఎంపీటీసీ ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలతో పని చేయించొద్దు



ఇటుక బట్టీల వద్ద బడిఈడు పిల్లలతో సీఆర్పీలు

పాన్‌గల్: బడిఈడు కలిగిన పిల్లలను తప్పకుండా బడికి పంపించాలని సీఆర్పీలు గోవింద్‌నాయక్, సంతోష్ తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం మండలంలోని అన్నారంతండా, జమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించి బడిఈడు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా అన్నారంతండా సమీపంలో ఇటుక బట్టీల వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు పనులు చేస్తున్నారని, వారి పిల్లలను బడికి పంపకుండా పనుల వద్ద ఉంచుకోవడం సరికాదని సూచించారు. తప్పక బడికి పంపించాలని లేదా పనుల వద్దనే చదువు చెప్పించేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. జమ్మాపూర్‌లో బడి మానేసిన 9వ తరగతి విద్యార్థి శివకుమార్ తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరించి బడికి పంపించేలా వారిని ఒప్పించినట్లు సీఆర్పీలు పేర్కొన్నారు. బడిఈడు పిల్లలచే పనులు చేయించడం చట్టారీత్యా నేరం అన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



స్వీపర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు 40 ఏళ్ల పాటు స్వీపర్‌గా మొగులాలీ సేవలు అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. ఆయన బుధవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు మొగులాలి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు వరప్రసాద్‌రావు, జిల్లా నాయకులు రామచంద్రయ్య, శివశంకర్‌ప్రసాద్, మండల అధ్యక్షులు దయానంద్, చిన్న రాములు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి



కొత్తకోటలో కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని, కార్మికులను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16 నుంచి చేపడుతున్న సమ్మెకు సంబంధించి బుధవారం కార్మికులు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల నుంచి ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు ఇచ్చే వేతనం రూ.24వేల తెలంగాణలోనూ అమలు చేయాలని కోరారు. కొత్తగా నియమించుకున్న కార్మికులను పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని, ప్రమాదంలో మరణిస్తున్న కార్మికులకు రూ.25లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలన్నారు. అంతే కాకుండా మరణించిన కార్మికుడి అంత్యక్రియ ఖర్చుల నిమిత్తం రూ.30వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం, పండుగ సెలవులు, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆనంద్‌రాజు, కార్యదర్శి రమేష్, కొండన్న, కుర్మన్న, బాలస్వామి, నోవేల్, కొండన్న, పెద్దరాజు, ప్రసాద్, మద్దిలేటి, శేఖర్, లక్ష్మి, సుశీల, సరళ, సుగుణమ్మ, దివ్య, పద్మ పాల్గొన్నారు.



అమరచింతలో..

అమరచింత: ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నోటీస్‌ను అందించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ ఎస్ రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏరియల్స్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేల ఇవ్వాలనే డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యానియన్ నాయకులు ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, సునీల్, రవీందర్, చిన్న, తిప్పన్న, మహేందర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ 'హస్త'గతం కావడం ఖాయం



చల్లావంశీచందర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర చేస్తున్న కొత్తకోట కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించబోతుందని, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌ను హస్తగతం చేసుకోవడం ఖాయమని కాంగ్రెస్‌పార్టీ నాయకులు అన్నారు. బుధవారం మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ నుంచి ప్రారంభమైన వంశీచంద్‌రెడ్డి పాలమూరు న్యాయ్‌యాత్రకు ఆత్మకూర్ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. బీజేపీ, బీఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యమని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, శ్రీను, సాయి రాఘవ, రఫీక్, గంగ, అజ్మతుల్లా, మస్తాన్, దస్తగిరి, బుచ్చన్న, శ్రీను, అబ్దుల్లా ఉన్నారు.

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని మక్తల్ నియోజవర్గంలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచందర్‌రెడ్డి బుధవారం నుంచి తలపెట్టిన 'పాలమూరు న్యాయ యాత్ర'కు కొత్తకోట మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వంశీచందర్‌రెడ్డితో పాటు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాదయాత్రకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లాలో రగ్బీకి గుర్తింపు తెచ్చేందుకు కృషి



ఎంపికైన క్రీడాకారులతో అధ్యక్షుడు మన్నె మన్నెపురెడ్డి, కార్యదర్శి హఫీజ్

వనపర్తి: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వనపర్తి జిల్లా రగ్బీ అండర్–14 క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నె మన్నెపురెడ్డి, ఎండీ హఫీజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల మైదానంలో బుధవారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ రగ్బీ బాల బాలికలు జట్లకు ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా డీవైఎస్ఓ సుధీర్‌రెడ్డి, జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి హఫీజ్ మాట్లాడుతూ జిల్లాలో రగ్బీ ఆటకు గుర్తింపు తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రగ్బీ ఎంపికలకు దాదాపు 60 మంది బాలబాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరిలో ఈ నెల 3, 4 తేదీల్లో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టోర్నమెంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఈటీలు అంజి, ఆరీఫ్, జబ్బార్, సుజాత, వెంకటేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

పెద్దకొత్తపల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలక పాత్ర అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పదవీకాలం ముగుస్తున్న సర్పంచ్‌లను బుధవారం పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సర్పంచ్‌లు ఎంతో కష్టపడ్డారన్నారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు శశికళ రవికుమార్, కొండలయ్య, సర్పంచ్‌లు సత్యం, రమేశ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాధా, చిన్నయ్య, ఎంపీడీఓ కృష్ణయ్య పాల్గొన్నారు.